సాక్షి
ఖమ్మం
సోమవారం । 29 । ఏప్రిల్ । 2024



ఆర్టీసీలో 'మహాలక్ష్మి' కళ!

మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించగా అపూర్వ స్పందన లభిస్తోంది. 8లో



12 ఏళ్ల తర్వాత..

పశ్చిమబెంగాల్‌కు చెందిన ఓ వ్యక్తి మతి స్థిమితం కోల్పోయి తిరుగుతుండగా అన్నం ఫౌండేషన్ వారు చేరదీసి, కుటుంబీకులకు అప్పగించారు. 8లో

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం
42° / 27°

జిల్లాలో సోమవారం అధిక ఉష్ణోగ్రత నమోదవుతుంది. ఉదయం నుంచి ఎండ గంటగంటకూ పెరుగుతూ మధ్యాహ్నానికి తీవ్రమవుతుంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా 'గురుకుల' ప్రవేశ పరీక్ష



పరీక్షను పరిశీలిస్తున్న ఆర్సీఓ, డీఈఓ

ఖమ్మంమయూరిసెంటర్ : మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ గురుకులాల సొసైటీ ఆధ్వర్యంలో జూనియర్, ఉమ్మడి డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని ఆర్సీఓ టి.అంజలి తెలిపారు. ఖమ్మంలోని ఓ కేంద్రంలో నిర్వహించిన పరీక్షను ఆదివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 15 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఇంటర్‌లో ప్రవేశాల కోసం 2,163 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 1,879 మంది విద్యార్థులు హాజరయ్యారని, డిగ్రీలో ప్రవేశాలకు 1,379 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 1,222 మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. కార్యక్రమంలో డీఈఓ సోమశేఖర శర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైద్య విధాన పరిషత్ కమిషనర్ రాక

నేలకొండపల్లి: రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ అశోక్‌కుమార్ సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. తొలుత పాలేరు నియోజకవర్గంలోని తిరుమలాయపాలెం వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిని ఆయన సందర్శించనున్నారు. అక్కడే జిల్లాలోని పలువురు వైద్యాధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. అనంతరం నేలకొండపల్లిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను సందర్శిస్తారు. అశోక్‌కుమార్ రాక నేపథ్యంలో స్థానిక వైద్యాధికారులు, సిబ్బంది ఉరుకులు, పరుగులు తీస్తున్నారు. ఆస్పత్రి ఆవరణ అంతా శుభ్రం చేస్తున్నారు. ఆయా రికార్డులను సిద్ధం చేస్తున్నారు. కాగా విషయం తెలుసుకున్న స్థానికులు, సమాచార హక్కు చట్టం ప్రతినిధులు కమిషనర్‌కు వివిధ అంశాలపై ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు. నేలకొండపల్లి ఆస్పత్రికి సంబంధించిన దాదాపు రూ.40 కోట్ల విలువైన స్థలాన్ని ఆక్రమించిన ఘటనపై ఫిర్యాదు చేయనున్నట్లు సామాజిక కార్యకర్త పసుమర్తి శ్రీనివాస్ తెలిపారు.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం అంతరాలయంలో మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. వేసవిసెలవులు, వారాంతపు సెలవు దినాలు కావడంతో భక్తులు స్వామివారిని పెద్దఎత్తున దర్శించుకున్నారు. నిత్యకల్యాణం, ఇతర ఆర్జిత సేవల్లో సైతం పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి విశేష పూజలు



పెద్దమ్మతల్లిని దర్శించుకున్న భక్తులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి అర్చకులు విశేషపూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. క్యూలైన్ ద్వారా అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు అమ్మవారికి విశేష పూజలు జరిపారు. భక్తులు అన్నప్రాసనలు, ఒడిబియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో ఈఓ జి.సుదర్శన్, అర్చకులు పాల్గొన్నారు.

మేం ఎదగాలా.. వద్దా ?!

పబ్లిక్ డిమాండ్

'ఖమ్మంలో జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు దశాబ్దాల కల. యూనివర్సిటీ లేకపోవడంతో ఇక్కడి యువత హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లి చదువుకోవడం భారంగా మారుతోంది. ఇది భరించలేక కొందరు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. ఖమ్మం కేంద్రంగా యూనివర్సిటీ ఏర్పాటు చేస్తే పరిసర ప్రాంతాల యువతకు ఉపయోగపడుతుంది' అని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు అభిప్రాయపడ్డారు. యూనివర్సిటీ ఏర్పాటు కోసం విద్యార్థి సంఘాలు కొన్నేళ్లుగా పోరాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతులు ఇస్తూనే ఉన్నాయి. ఈ నేపథ్యాన ఖమ్మంలో యూనివర్సిటీ ఆవశ్యకత, ఆటంకాలు తదితర అంశాలపై 'సాక్షి' ఆధ్వర్యాన నిర్వహించిన డిబేట్‌లో వివిధ విద్యార్థి, యువజన సంఘాల నాయకులు మాట్లాడారు. – ఖమ్మంమయూరిసెంటర్



ఉన్నత విద్యకు దూరంగా యువతరం

- కలగానే ఖమ్మం విశ్వవిద్యాలయం
- ఏళ్లుగా జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు డిమాండ్
- లోక్‌సభ ఎన్నికల హామీల్లో చేర్చాలని వినతులు



'సాక్షి' డిబేట్‌లో పాల్గొన్న విద్యార్థి సంఘాల నాయకులు

అన్నీ అనుకూలాంశాలే...

ఉమ్మడి ఖమ్మం జిల్లా కేంద్రంగా ఉన్న ఎస్‌ఆర్‌అండ్ బీజీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల దేశంలోనే తొలిసారిగా న్యాక్ ఏ ప్లస్ ప్లస్ (++) గ్రేడ్ సాధించిందని డిబేట్‌లో పాల్గొన్న వక్తలు వెల్లడించారు. ఈ కళాశాల ఆవరణలో యూనివర్సిటీ ఏర్పాటుకు సరిపడా స్థలం, భవనాలు ఉన్నాయని అన్నారు. ఈ కళాశాల వేదికగా ప్రభుత్వ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తే ఉమ్మడి ఖమ్మం కేంద్రంగా అందరికీ ఉన్నత విద్య అందుతుందని.. యూజీసీ నిబంధనల ప్రకారం యూనివర్సిటీ ఏర్పాటుకు ఖమ్మంలో అనుకూల పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 146 డిగ్రీ కళాశాలలు, 26 పీజీ కళాశాలలు, 10 బీఈడీ, నాలుగు డైట్, ఒక లా కళాశాలలు ఉండగా.. సుమారు 90 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారని చెప్పారు. ఇక్కడ ప్రభుత్వ యూనివర్సిటీ ఏర్పాటైతే దూరాభారం తగ్గుతుందని అభిప్రాయపడ్డారు.

నిరుద్యోగులకు అవకాశాలు

యూనివర్సిటీ లేక విద్యార్థులు డిగ్రీ తర్వాత ఉన్నత విద్య కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని వక్తలు తెలిపారు. కొందరు వెళ్తున్నా.. ఇంకొందరు వెళ్లలేక డిగ్రీతో చదువు ఆపేస్తున్నారని పేర్కొన్నారు. ఫలితంగా వారికి ఉపాధి లభించడం లేదని తెలిపారు. ఖమ్మం కేంద్రంగా యూనివర్సిటీ ఏర్పా టుచేస్తే విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులోకి రావడమే కాక యూనివర్సిటీలో అధ్యాపకుల పోస్టులు, నాన్ టీచింగ్, ఇతర విభాగాల్లో అనేక ఉద్యోగాలు లభించే అవకాశముందని చెప్పారు. ఈ మేరకు లోక్‌సభ ఎన్నికల్లోనైనా రాజకీయ పార్టీలు యూనివర్సిటీ ఏర్పాటును తమ మేనిఫెస్టోలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ డిబేట్‌లో ఎస్‌ఎఫ్‌ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎస్‌ఎఫ్, ఎన్‌ఎస్‌యూఐ, పీవైఎల్ సంఘాల నాయకులు టి.ప్రవీణ్‌కుమార్, వి.వెంకటేష్, ఎం.లక్ష్మణ్, జి.మస్తాన్, ఆసిఫ్, కె.లక్ష్మీనారాయణ, మంద సురేష్, ఎం.కరుణ్, లాల్‌పాషా, సందీప్, డి.శ్రీను, వినోద్, మనోజ్, శివ, ఎం.సాయి, ఎన్.సాయి, క్రాంతి, రామకృష్ణ, వర్ధన్, రాజేష్, కార్తీక్ పాల్గొన్నారు.

ఉన్నత విద్యకు దూరమవుతున్నారు..



ఇక్కడ యూనివర్సిటీ లేక విద్యార్థులు మధ్యలోనే చదువు మానేస్తున్నారు. గత ప్రభుత్వాలు హామీ ఇచ్చినా విస్మరించాయి. ఇకనైనా ప్రభుత్వ జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి.

– టి.ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి

దశాబ్దాలుగా ఉద్యమం..



ఖమ్మం విద్యా హబ్‌గా ఉంది. దశాబ్దాలుగా యూనివర్సిటీ కోసం ఉద్యమాలు జరుగుతున్నాయి. ఈసారి 'ఓటు కావాలంటే.. మాకు యూనివర్సిటీ ఇవ్వండి' అని పార్టీలను డిమాండ్ చేస్తాం.

– వి.వెంకటేష్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి

జిల్లాకు అర్హత ఉంది..



ఖమ్మంలో ప్రభుత్వ జనరల్ యూనివర్సిటీ ఏర్పాటుకు అర్హతలు ఉన్నా పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇకనైనా పరిశీలించి యూనివర్సిటీ ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించాలి.

– ఎం.లక్ష్మణ్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు

అన్ని జిల్లాల్లో ఉన్నా...



రాష్ట్రంలో అన్ని ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో యూనివర్సిటీలు ఉన్నా ఖమ్మంలో లేదు. దీంతో ఇక్కడి యువత చదువు ఆపేయాల్సి వస్తోంది. కొత్త ప్రభుత్వమైనా ఈ విషయంలో చొరవ చూపాలి.

– జి.మస్తాన్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి

మంత్రులు సానుకూలంగా ఉన్నారు..



గత ప్రభుత్వం యూనివర్సిటీపై ఆలోచన చేయలేదు. ప్రస్తుత డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు సానుకూలంగా ఉన్నందున యూనివర్సిటీ ఏర్పాటుపై ప్రభుత్వం చర్యలు చేపడుతుంది.

– ఆసిఫ్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఘనంగా టీటీ రాష్ట్ర టోర్నీ ప్రారంభం

340 మంది బాలబాలికల హాజరు



నాకౌట్ పద్ధతిలో ఆడుతున్న క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్ : రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఆదివారం ప్రారంభమయ్యాయి. పోటీలకు హైదరబాద్, కరీంనగర్, నిజామాబాద్, నల్లగొండ, మంచిర్యాల తదితర జిల్లాల జట్లు హాజరయ్యాయి. తొలుత క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. అనంతరం మ్యాచ్‌లను ప్రారంభించారు. పోటీలు మరో రెండు రోజుల పాటు జరుగుతాయని పేర్కొన్నారు. మ్యాచ్‌లు డే అండ్ నైట్ జరిగేలా చర్యలు తీసుకున్నట్లు నిర్వాహక కార్యదర్శి ఓలేటి సాంబమూర్తి తెలిపారు. సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో హోరాహోరీగా నిర్వహిస్తామని తెలిపారు. కాగా, ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి కొద్దిసేపు టేబుల్ టెన్నిస్ ఆడి అందరినీ ఆశ్చర్య పరిచారు. క్రీడా రంగానికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్, బాలసాని లక్ష్మీనారాయణ, జావేద్, జిల్లా టేబుల్ టెన్నిస్ అధ్యక్షుడు బాలసాని విజయ్‌కుమార్, కూరపాటి ప్రదీప్‌కుమార్, జంగా కార్తీక్, ఎంజీవీ ప్రవీణ్, డీవైఎస్‌ఓ టి. సునీల్‌కుమార్ రెడ్డి, కొండ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న జడ్జికి వీడ్కోలు

ఖమ్మంలీగల్: బదిలీపై వెళ్తున్న జిల్లా జడ్జి బి.ఎస్.జగ్జీవన్‌కుమార్‌ను టీఎస్ సీపీఎస్ ఈయూ జిల్లా బాధ్యులు ఆదివారం జడ్జి నివాసగృహంలో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జగ్జీవన్‌కుమార్ జిల్లాలో ఉత్తమ సేవలు అందించారని అన్నారు. పాత పెన్షన్ సాధించడమే ఏకైక అజెండాగా టీఎస్ సీపీఎస్ ఈయూ ముందుకు వెళుతోందన్నారు. కార్యక్రమంలో యూనియన్ అసోసియేట్ ప్రెసిడెంట్ చర్ల శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షురాలు ఎం.శ్వేత, వైస్ ప్రెసిడెంట్లు ఆర్.వెంకట్ లాల్, ఐ.భాను, జాయింట్ సెక్రటరీ ఎస్.కె.ముబీన్ అహ్మద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎ.బంగారయ్య, జిల్లా సెక్రటరీ ఎస్‌కే అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌ను ప్రధాని చేయడమే లక్ష్యం



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, పక్కన ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే రాగమయి, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల తదితరులు

- ఇందిరమ్మ కుటుంబానికి అండగా ఉందాం
- ఖమ్మం పార్లమెంట్‌లో కాంగ్రెస్‌ను గెలిపించి సీఎంకు గిఫ్ట్ ఇద్దాం
- మంత్రులు పొంగులేటి, తుమ్మల
- కాంగ్రెస్‌లో ఇద్దరు కౌన్సిలర్ల చేరిక

సత్తుపల్లి: దేశం కోసం బలిదానం చేసిన ఇందిర, రాజీవ్‌గాంధీ కుటుంబానికి అండగా నిలవాలని, రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా పని చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక మాధురి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం ఎమ్మెల్యే మట్టా రాగమయి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ ఖమ్మం ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. రామసహాయం కుటుంబం 60 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని పని చేస్తోందని చెప్పారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పదేళ్లలో దేశ ప్రతిష్టను తాకట్టు పెట్టిందని ఆరోపించారు. నల్లచట్టాలు రద్దు చేయాలని ఢిల్లీ సమీపంలో రెండున్నరేళ్లుగా ఆందోళన చేస్తున్న 800 మంది రైతులను పొట్టన పెట్టుకుందని, అలాంటి బీజేపీకి ఓట్లు అడిగే హక్కు లేదని విమర్శించారు. ప్రధాని మోదీ ప్రజల సొమ్ముతో ఉదయం ఒక దేశం, సాయంత్రం ఒక దేశం, రాత్రికి మరో దేశం తిరుగుతూ గంటకో ఖరీదైన డ్రెస్ వేసుకుంటూ మతాల మధ్య చిచ్చుపెడుతున్నారని, రాముడిని కూడా రాజకీయాల్లోకి తెస్తున్నారని మండిపడ్డారు. ఇక రాష్ట్రంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మంత్రి నుంచి ఎమ్మెల్యే వరకు ఎవరినీ కలవకుండా, ఇప్పుడు మాయమాటలు చెబుతున్నారని విమర్శించారు. ఆగస్టు 15 కల్లా రూ.2 లక్షల రుణమాఫీ, ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు, పేదలకు రేషన్ కార్డులు, పెన్షన్లు ఇస్తామని హామీ ఇచ్చారు.

రేవంత్‌రెడ్డికి గిఫ్ట్‌గా ఇద్దాం..

రాష్ట్రంలోని 17 పార్లమెంట్ స్థానాల్లో ఖమ్మం స్థానాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించి సీఎం రేవంత్‌రెడ్డికి గిఫ్ట్‌గా ఇద్దామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సత్తుపల్లి తనకు రాజకీయంగా జన్మనిచ్చిందని, ఈ ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉంటానని అన్నారు. గోదావరి జలాలను ప్రతీ ఎకరాకు సాగునీరుగా అందేలా కృషి చేస్తానని ప్రకటించారు. రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా రైతుల మోములో చిరునవ్వు చూసేందుకు రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేస్తామని హామీ ఇచ్చారు.

నాపేరే రామ సహాయం..

రాముడు బీజేపీ వారికే దేవుడు కాదని, అందరికీ ఆయన ఆరాధ్య దైవమని ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. తన ఇంటి పేరే రామ సహాయం అని, మరిపెడలో సొంతంగా రామాలయాన్ని నిర్మించానని చెప్పారు. తనను గెలిపిస్తే జిల్లా ప్రజలకు సేవ చేస్తానని, అందరికీ అందుబాటులో ఉంటూ జిల్లా అభివృద్ధికి పాటుపడతానని అన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, దయానంద్ మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గంలో 50 వేల కంటే ఎక్కువ మెజార్టీ వచ్చేలా పని చేస్తామని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల కంటే మరింత ఎక్కువగా కష్టపడి కాంగ్రెస్‌ను గెలిపిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా సత్తుపల్లి మున్సి పల్ కౌన్సిలర్లు కంటే నాగలక్ష్మి, ఎండి సలీమా ఖాతూన్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. సమావేశంలో టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు మద్దినేని బేబీ స్వర్ణకుమారి, గాదె చెన్నారావు, మోరంపూడి పాండు, దండు ఆదినారాయణ, చల్లగుళ్ల నర్సింహారావు, ఉడతనేని అప్పారావు, నున్నా రామకృష్ణ, శివవేణు, పుచ్చకాయల సోమిరెడ్డి, చల్లారి వెంకటేశ్వరరావు, ఎస్‌కె మౌలాలీ, ఎండీ కమాల్‌పాషా, కూసంపూడి నర్సింహారావు పాల్గొన్నారు.

నేడు ఖమ్మంలో కేసీఆర్ బస్సు యాత్ర

- రాత్రికి నగరంలోనే బస
- రేపు ఖమ్మంలో ముఖ్య నేతలతో సమావేశం, కొత్తగూడెంలో రోడ్‌షో



ఖమ్మంమయూరిసెంటర్ : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఆ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చేపట్టిన బస్సు యాత్ర సోమవారం ఖమ్మం చేరుకోనుంది. నేడు సాయంత్రం వరంగల్ నుంచి తిరుమలాయపాలెం మీదుగా ఖమ్మం చేరుకుని, కాల్వొడ్డు నుంచి మయూరిసెంటర్, వైరా రోడ్డు మీదుగా జెడ్పీ సెంటర్‌కు యాత్ర కొనసాగుతుంది. మాజీ సీఎం కేసీఆర్ జెడ్పీ సెంటర్‌లో ప్రజలనుద్దేశించి మాట్లాడుతారు.

బస్సుయాత్ర విజయవంతానికి ఏర్పాట్లు..

అసెంబ్లీ ఎన్నికల సమయంలో కేసీఆర్ ఖమ్మంలో జరిగిన సభలో చివరిసారిగా పాల్గొన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించేందుకు తిరిగి బస్సుయాత్ర చేపట్టారు. సోమవారం ఖమ్మంలో కేసీఆర్ పాల్గొనే బస్సుయాత్రను జయప్రదం చేసేందుకు జిల్లా బీఆర్‌ఎస్ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. కేసీఆర్‌కు ఘన స్వాగతం పలకడంతో పాటు యాత్రకు అడుగడుగునా బ్రహ్మరథం పట్టేలా సన్నాహాలు చేస్తున్నారు.

ఖమ్మంలో ముఖ్య నేతలతో సమావేశం..

సాయంత్రం 5 గంటలకు కేసీఆర్ బస్సుయాత్ర ఖమ్మం చేరుకోనుంది. నగరంలో బస్సుయాత్ర, జెడ్పీ సెంటర్‌లో కార్నర్ మీటింగ్ ముగిసిన అనంతరం కేసీఆర్ ఖమ్మంలోని మాజీ మంత్రి పువ్వాడ నివాసంలో బస చేయనున్నారు. 30వ తేదీ ఉదయం బీఆర్‌ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ తాత మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించనున్నారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం కోసం చేపట్టాల్సిన అంశాలపై నాయకులకు దిశానిర్దేశం చేయనున్నారు. సాయంత్రం బస్సుయాత్ర ఖమ్మం నుంచి బయలుదేరి వైరా, తల్లాడ మీదుగా భద్రాద్రి జిల్లా జూలూరుపాడుకు చేరుకోనుంది. అక్కడ నుంచి కొత్తగూడెం చేరుకుని అక్కడ నిర్వహించే సభలో మాట్లాడుతారు. మంగళవారం రాత్రి కొత్తగూడెంలోనే బస చేసి, బుధవారం ఇల్లెందు మీదుగా మహబూబాబాద్‌కు వెళతారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

నేడు కొత్తగూడేనికి జేపీ నడ్డా

చుంచుపల్లి: భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు జయప్రకాశ్ నడ్డా సోమవారం కొత్తగూడెం రానున్నారు. ప్రకాశం స్టేడియంలో జరిగే ఖమ్మం పార్లమెంటరీ బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తారు. ఉదయం 10:50 గంటలకు విజయవాడ నుంచి బయలుదేరి 11.20 గంటలకు కొత్తగూడెం హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 11.35 గంటలకు ప్రకాశం స్టేడియంలో జరిగే బహిరంగ సభకు హాజరవుతారు. 11:40 నుంచి 12:30 వరకు సభలో ప్రసంగిస్తారు. తిరిగి 12.50 గంటలకు హెలికాప్టర్‌లో మహబూబాబాద్ వెళతారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎంపీ కె.లక్ష్మణ్, ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు తదితరులు ఉంటారు.

యువ ఓటర్లు 50,747 మంది



- మొదటిసారి ఓటు వేయనున్న యువత
- 18–19 ఏళ్ల ఓటర్లలో యువకులే ఎక్కువ..

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో యువ ఓటర్ల లెక్క తేలింది. ఈనెల 25వ తేదీన అధికారులు తుది ఓటర్ల జాబితాను ప్రకటించారు. ఇందులో మొత్తం ఓటర్లు 16,31,039 మంది ఉండగా.. 18 నుంచి 19 ఏళ్ల వయసు ఓటర్లు 50,747మంది ఉన్నారని వెల్లడైంది. వీరిలో 26,775 మంది యువకులు, 23,967మంది యువతులతో పాటు ఇతరులు ఐదుగురు ఉన్నారు. కాగా, లోక్‌సభ పరిధిలోని మొత్తం ఓటర్లలో మహిళలే ఎక్కువగా ఉండగా.. 18 – 19 ఏళ్ల కేటగిరిలో మాత్రం యువకులే ఎక్కువగా ఉండడం విశేషం. ఇక వీరిలో కొందరు తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోగా.. ఎక్కువ మంది మాత్రం లోక్‌సభ ఎన్నికల్లోనే తొలిసారి ఓటు వేయనున్నారు.

18-19 ఏళ్ల వయసు గల ఓటర్లు

నియోజకవర్గం	యువకులు	యువతులు	ఇతరులు	మొత్తం
ఖమ్మం	5,606	5,224	00	10,830
పాలేరు	4,451	3,823	00	8,274
మధిర	3,715	3,318	02	7,035
వైరా	3,298	2,913	00	6,211
సత్తుపల్లి	4,046	3,680	01	7,727
కొత్తగూడెం	3,410	3,095	01	6,506
అశ్వారావుపేట	2,249	1,914	01	4,164
మొత్తం	26,775	23,967	05	50,747

గెలిపిస్తే అండగా ఉంటా..

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న



మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం, వరంగల్, నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే మున్నూరు కాపులకు అండగా ఉంటానని కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అన్నారు. ఆదివారం ఖమ్మం నగరంలోని కాపు కులస్తులను కలిసి ఆయన మద్దతు కోరారు. పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటిస్తున్నానని, జిల్లాలోని కాంగ్రెస్ నాయకులతో పాటు వివిధ కులసంఘాలు, ఉద్యోగ సంఘాలను కలిసి ఓటు అభ్యర్థిస్తున్నానని తెలిపారు. మే 3న నామినేషన్ వేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మొదటి విడత ప్రచారం ఇప్పటికే పూర్తిచేశానని, రాబోయే రోజుల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులను కలిసి మద్దతు కోరుతానని అన్నారు. మే 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలిపించాలని మల్లన్న విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల గాంధీ, శెట్టి రంగారావు, పొదిల రవికుమార్, మాజీ ఎంపీపీ పగడాల మంజుల, రాపర్తి శరత్, మదూరి ప్రసాద్, తాళ్లూరి హనుమంతరావు, కొత్తా సీతారాములు, మేకల భిక్షమయ్య, మరిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో 'మహాలక్ష్మి' కళ!

ఉచిత ప్రయాణానికి అపూర్వ స్పందన

- రీజియన్‌లో ఇప్పటివరకు 1.40 కోట్ల మంది మహిళల రాకపోకలు
- ఆర్టీసీకి రూ.72.18 కోట్ల మేర ఆదాయం
- జీరో టికెట్ వరమంటున్న మహిళామణులు

ఆర్టీసీలో అమలవుతున్న మహాలక్ష్మి పథకానికి అపూర్వ స్పందన లభిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతేదాది డిసెంబర్ 9న మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. తొలి వారం పాటు మహిళలకు ఎలాంటి ఆధారం చూపించకుండానే ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో ఉచితంగా ప్రయాణించే వెసులుబాటు కల్పించారు. ఆ తర్వాత డిసెంబర్ 14 నుంచి ఆర్టీసీలో జీరో టికెట్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చి ఒరిజినల్ ఆధార్ కార్డు చూపించాలనే నిబంధన ప్రవేశపెట్టారు. కాగా, ఈ విధానం అమల్లోకి వచ్చాక ఆర్టీసీలో 54 శాతానికి పైగా మహిళలు ఉచిత బస్సు ప్రయాణాన్ని వినియోగించుకుంటుండగా.. గతంలో 69 శాతంగా ఉన్న ఓఆర్.. ఇప్పుడు ఏకంగా 90 – 100 శాతానికి పెరిగింది. ఉచితంగా ప్రయాణించే మహిళా ప్రయాణికుల చార్జీ మొత్తాన్ని ఆర్టీసీకి ప్రభుత్వమే చెల్లిస్తుండగా.. తమకు ఆర్థికంగా వెసులుబాటు కలిగిందని అతివలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – చుంచుపల్లి


ఆర్టీసీ బస్సులో మహిళా ప్రయాణికులు

ఖమ్మం రీజియన్‌లో ప్రయాణించిన మహిళలు

డిపో	ప్రయాణికులు	ఆదాయం (రూ.లక్షల్లో)
భద్రాచలం	14,01,734	934.15
ఖమ్మం	35,19,207	1,741.22
కొత్తగూడెం	19,95,745	1,048.22
మధిర	12,82,001	911.88
మణుగూరు	19,47,087	1,071.00
సత్తుపల్లి	34,23,831	1,269.64
ఇల్లెందు	5,26,150	242.68

1.40 కోట్ల మంది ఉచిత ప్రయాణం

మహాలక్ష్మి పథకానికి ముందు.. తర్వాత అన్నట్లు ఆర్టీసీలో రికార్డులు నమోదవుతున్నాయి. గతంలో ఆర్టీసీ బస్టాండ్లలో డ్రైవర్లు, కండక్టర్లు పోటీ పడి బస్సుల్లో ప్రయాణికులను ఎక్కించుకునేవారు. బస్సు నిండే వరకు వేచి ఉండేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయింది. బస్సు ప్లాట్‌ఫాం మీదకు రావడమే ఆలస్యం.. జనం కిక్కిరిసిపోతున్నారు. ఖమ్మం రీజియన్ పరిధిలో ఖమ్మం, మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు ఏడు ఆర్టీసీ డిపోలు ఉండగా.. మహాలక్ష్మి పథకం అమలవుతున్న ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సులు 383 ఉన్నాయి. ఇందులో ఆర్టీసీకి చెందిన పల్లె వెలుగులు 74, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు 63 ఉండగా, ఇక అద్దె బస్సులకు సంబంధించిన పల్లె వెలుగు సర్వీసులు 124, ఎక్స్‌ప్రెస్‌లు 122 నడుస్తున్నాయి. ఈ సర్వీసులు రోజువారీ 1.55 కిలోమీటర్ల మేర తిరుగుతుంటాయి. కాగా, రీజియన్ పరిధిలో గత డిసెంబర్ 14 నుంచి ఇప్పటివరకు 1,40,95,755 మంది మహిళలు ఉచితం ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకున్నారు. వీరి టికెట్ల మొత్తాన్ని ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించనుండడంతో సంస్థకు రూ. 72.18 కోట్ల ఆదాయం సమకూరినట్లయింది. కాగా, ఖమ్మం డిపోలో అత్యధికంగా 35,19,207 మహిళా ప్రయాణికులు ఆర్టీసీలో ప్రయాణించగా, అత్యల్పంగా ఇల్లందులో 5,26,150 మంది మహిళలు ప్రయాణించారు. అయితే, ఈ పథకం అందుబాటులో ఉన్న పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లు మరిన్ని అందుబాటులోకి తీసుకురావడంతో పాటు సెలవు రోజుల్లో సర్వీసుల సంఖ్య పెంచితే అటు మహిళలు.. ఇటు ఇతర ప్రయాణికులకు సౌలభ్యంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.


ఆధార్ కార్డులను వెంట తీసుకొని బస్సెక్కిన మహిళలు

మహిళలకు వరం


మహాలక్ష్మి పథకం మహిళలకు వరంగా మారింది. ఈ పథకం ద్వారా తెలంగాణ పరిధిలో ఎక్కడి నుంచి ఎక్కడైనా ఉచితంగా ప్రయాణించడాన్ని మంచి అవకాశంగా భావిస్తున్నాం. ఆర్టీసీలో ఇలాంటి పథకాన్ని ప్రవేశపెట్టడం గొప్ప విషయం.
– రాజేశ్వరి

ఆర్థిక భారం తప్పింది


ఈ పథకంతో మహిళలపై భారం తగ్గింది. కొత్తగూడెం నుంచి ఇల్లెందుకు రూ.70 చార్జి ఉండేది. ఇప్పుడు ఉచితంగానే వెళ్లి వస్తున్నాం. మహిళలు ఊహించని విధంగా ఉచిత ప్రయాణాన్ని ప్రారంభించడం అభినందనీయం.
– టి.లక్ష్మి

రికార్డుస్థాయి ప్రయాణాలు


మహాలక్ష్మి పథకానికి అనూహ్య స్పందన వస్తోంది. గడిచిన నాలుగు నెలల్లో ఏకంగా 1.40 కోట్ల మంది మహిళలు సద్వినియోగం చేసుకున్నారు. రీజియన్ పరిధిలో జీరో టికెట్ల ద్వారా రూ.72.18 కోట్ల ఆదాయం సమకూరింది.
– సీహెచ్.వెంకన్న, ఆర్ఎం

క్లుప్తంగా

రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక


సీఎం సమక్షంలో పార్టీలో చేరిన దిలీప్

తల్లాడ: బీఆర్‌ఎస్వీ జిల్లా కో ఆర్డినేటర్ బోజడ్ల దిలీప్ శనివారం రాత్రి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని, సీఎం ప్రవేశపెట్టిన గ్యారంటీలను అమలు చేస్తున్నందున కాంగ్రెస్‌లో చేరినట్లు ప్రకటించారు. ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి గెలుపునకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వర్కంతుల సాగర్, సురేందర్‌రెడ్డి, కళ్యాణ్, ప్రశాంత్, శ్రీరామ్ పాల్గొన్నారు.

హెలికాప్టర్ తనిఖీ


హెలికాప్టర్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానానికి ఆదివారం చేరిన హెలికాప్టర్‌ను సత్తుపల్లి నియోజకవర్గ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సత్తుపల్లిలో జరిగిన నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న అనంతరం హైదరాబాద్‌లో జరిగే అత్యవసర సమావేశానికి ఈ హెలికాప్టర్‌లో వెళ్లారు. కాగా, ఎన్నికల కోడ్ నేపథ్యంలో అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలి

- డిప్యూటీ పోలీస్ కమిషనర్ ప్రసాద్‌రావు


పైనంపల్లి వద్ద చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న డీసీపీ ప్రసాద్‌రావు

నేలకొండపల్లి : ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఖమ్మం డిప్యూటీ పోలీస్ కమిషనర్ ప్రసాద్‌రావు ఆదేశించారు. మండలంలోని పైనంపల్లి వద్ద ఏర్పాటుచేసిన జిల్లా సరిహద్దు చెక్‌పోస్టు వద్ద ఆదివారం ఆయన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏ ఒక్క వాహనాన్నీ వదలకుండా తనిఖీలను విస్తృతం చేయాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు నగదు, మద్యం, ఇతర తాయిలాలు జిల్లాలోకి రాకుండా నిఘా పటిష్టం చేయాలని సూచించారు. ఎన్నికలు సమీపిస్తున్నందున 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట చెక్‌పోస్టు తనిఖీ అధికారి, ఇరిగేషన్ ఏఈ నరేష్, నేలకొండపల్లి ఎస్సై తోట నాగరాజు ఉన్నారు.

బైక్ పైనుంచి పడి వృద్ధురాలు మృతి

కారేపల్లి: ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం పై నుంచి కింద పడి ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని భాగ్యనగర్‌తండాలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పేరుపల్లి గ్రామానికి చెందిన అజ్మీర కమిలి (65) తమ బంధువుకు చెందిన ద్విచక్రవాహనం వెనుక కూర్చుని భాగ్యనగర్‌తండా గ్రామంలో ఓ శుభకార్యానికి వెళుతోంది. కాగా.. కమిలికి అధిక రక్తపోటు ఉండడంతో కళ్లుతిరిగి ద్విచక్రవాహనం పై నుంచి కిందపడింది. దీంతో తలకు తీవ్ర గాయం కాగా కుటుంబ సభ్యులు ఆటోలో ఖమ్మం ఆస్పత్రికి తరలిస్తుండగానే మృతి చెందింది.

వడదెబ్బతో వ్యక్తి ..

కామేపల్లి : వడదెబ్బతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. మండలంలోని పింజరమడుగు తండాకు చెందిన ఆలోత్ లక్ష్మా(48) శనివారం స్థానిక చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఆదివారం తెల్లవారుజామున తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబసభ్యులు వెంటనే ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి ..

ఖమ్మంక్రైం : ఈనెల 19న పురుగుమందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి ఆదివారం మృతిచెందాడు. వన్‌టౌన్ సీఐ ఉదయ్‌కుమార్ కథనం ప్రకారం.. పార్శీ బంధానికి చెందిన అంబటి శ్రీకాంత్ (33) కారు డ్రైవర్‌గా పనిచేస్తూ మద్యానికి బానిసై తిరుగుతున్నాడు. దీంతో అప్పులు భారీగా పెరిగాయి. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన శ్రీకాంత్ పురుగు మందు తాగాడు. కుటుంబసభ్యులు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. అతడి తల్లి మారుతమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,174

జూన్‌లో ఐజేయూ రాష్ట్ర మహాసభలు

- చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహించాలి
- టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ


మాట్లాడుతున్న విరాహత్ అలీ

ఖమ్మం సహకారనగర్ : టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర మహాసభలు జూన్‌లో ఖమ్మంలో నిర్వహిస్తున్నామని, ఈ సభలు చరిత్రలో మైలురాయిగా నిలిచిపోవాలని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ అన్నారు. ఆదివారం నగరంలో నిర్వహించిన యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మీడియా రంగంలో పెను మార్పులు చోటుచేసుకుంటున్నాయని, వృత్తిలో నిబద్ధతతో కొనసాగుతున్న వారు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. దశాబ్దాలుగా పని చేస్తున్న వారికి సైతం నివాస స్థలాలు దక్కలేదని, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల నివాస స్థలాల పంపిణీపై ప్రణాళిక తయారు చేస్తోందని చెప్పారు. మీడియా అకాడమీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు నివాస స్థలం, హెల్త్ కార్డులు అందించాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర మహాసభలకు తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా సౌహార్ధ ప్రతినిధులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. రాంనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర మహాసభల నిర్వహణ బాధ్యతను ఖమ్మం జిల్లాకు అప్పగించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావు, నాయకులు అమరవాది రవీంద్ర శేషు, మాటేటి వేణుగోపాల్, సామినేని మురారి, నలజాల వెంకట్రావు, ఖదీర్, ఖాదర్ బాబా, రమణారెడ్డి, ఆవుల శ్రీనివాస్, కనకం సైదులు, ఆలస్యం అప్పారావు, మైసా పాపారావు, చెరుకుపల్లి శ్రీనివాస్, నాగండ్ల శివానంద పాల్గొన్నారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి


బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: కిన్నెరసానికి ఆదివారం పర్యాటకులు అధిక సంఖ్యలో తరలిరాగా, సందడి నెలకొంది. కిన్నెరసాని జలాశయాన్ని, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. 392 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా, వాహనాల ప్రవేశ రుసుం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.11,310 ఆదాయం లభించగా, 178 మంది బోటు షికారు చేయగా, టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.8,900 లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

12 ఏళ్ల తర్వాత కుటుంబసభ్యుల చెంతకు..



సుజిత్‌ను కుటుంబసభ్యులకు అప్పగించాక, వారితో అన్నం శ్రీనివాసరావు

ఖమ్మంఅర్బన్: మతిస్థిమితం కోల్పోయి దారి తప్పి పశ్చిమ బెంగాల్ నుంచి ఖమ్మం వచ్చి అన్నం ఫౌండేషన్‌లో ఆశ్రయం పొందిన వ్యక్తిని 12 సంవత్సరాల తర్వాత అతడి కుటుంబసభ్యుల చెంతకు చేర్చగా.. వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. వివరాలిలా.. పశ్చిమబెంగాల్ రాష్ట్రం ముర్షిదాబాద్ జిల్లా బిందుపర గ్రామానికి చెందిన 47 ఏళ్ల సుజిత్ ప్రసాద్ సింగ్ ఐదేళ్ల క్రితం ఖమ్మం నగరంలోని ప్రకాష్ నగర్ ప్రాంతంలో మతి స్థిమితం కోల్పోయి తిరుగుతున్నాడు. జుత్తు పెరిగి, చిరిగిన బట్టలతో నడవలేక దీనస్థితిలో ఉండగా స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని అతడిని అన్నం సేవా ఫౌండేషన్‌కు తరలించారు. అక్కడే చికిత్స చేయిస్తూ ఆశ్రయం కల్పించిన ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు.. ఆ వ్యక్తి కోలుకున్న వివరాలు ఆరా తీశారు. తన పేరు సుజిత్ ప్రసాద్ సింగ్ అని, తండ్రి పేరు రాజ్గిరి ప్రసాద్‌సింగ్, తల్లి సునితి అని, తనకు ఇద్దరు సోదరులు సంజయ్ సింగ్, శంకర్ సింగ్, చెల్లి రిటసింగ్ ఉన్నారని తెలిపాడు. దీంతో అతడు అందించిన సమాచారం ఆధారంగా అక్కడి పోలీసులతో ఇంటర్నెట్ ద్వారా సమాచారం అందించగా పోలీసులు సుజిత్ కుటుంబసభ్యుల ఆచూకీ కనుగొని వారికి విషయం తెలియజేశారు. ఆ తర్వాత శ్రీనివాసరావే స్వయంగా సుజిత్‌ప్రసాద్ సింగ్‌ను తీసుకుని బెంగాల్ రాష్ట్రంలోని స్వగ్రామమైన బిందుపరకు వెళ్లి కుటుంబసభ్యులకు శనివారం అప్పగించారు. కాగా, సుజిత్ ప్రసాద్ సింగ్ 12 సంవత్సరాల క్రితం మతిస్థిమితం కోల్పోయి వెళ్లిపోయాడని, తాము అనేక ప్రాంతాల్లో వెదికినా ఆచూకీ లభించలేదని, తండ్రి 8 సంవత్సరాల క్రితం మృతి చెందాడని కుటుంబసభ్యులు తెలిపారు. ఇన్నేళ్ల తర్వాత అయినా తమ వద్దకు రావడం సంతోషంగా ఉందన్నారు. కాగా, బెంగాల్‌లోని జియాగంజి ఎస్సై బిశ్వజిత్ గోసాల్ అన్నం సేవలను అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములు మృతి

కరకగూడెం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అన్నదమ్ములు మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మణుగూరు మండలంలోని విజయనగరం కొమ్ముగూడెం గ్రామానికి చెందిన బిజ్జ రమేష్(40) తన సోదరుడు కృష్ణ(38)తో కలిసి ద్విచక్ర వాహనంపై కరకగూడెం మండలంలోని రేగళ్ల గ్రామంలో బంధువుల ఇంటి నుంచి తన కుమార్తెను తీసుకొచ్చేందుకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో కలవలనాగరం మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. దీంతో రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. కృష్ణకు తీవ్ర గాయాలుకాగా భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై రాజేందర్ ప్రమాద స్థలిని పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వ్యవసాయ బావిలో పడి రైతు మృతి


వెంకటరావు (ఫైల్)

చింతకాని : మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో తుమ్మలపల్లి వెంకటరావు (40) అనే రైతు ఆదివారం ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. వెంకటరావు సుబాబుల్ చెట్లకు నీళ్లు పెట్టేందుకు ఉదయం తోటకు వెళ్లాడు. మోటారు ఆన్‌చేసే క్రమంలో ప్రమాదవశాత్తు బావిలో పడ్డాడు. మధ్యాహ్నం వరకు ఇంటికి రాకపోవడంతో ఆయన భార్య పద్మ ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో చుట్టుపక్కల వారితో కలిసి తోటకు వెళ్లి చూడగా బావి వద్ద చెప్పులు కనిపించాయి. గ్రామస్తుల సహాయంతో బావిలో గాలించగా మృతదేహం కనిపించింది. సమాచారం తెలుసుకున్న ఎస్సై నాగుల్‌మీరా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వెంకటరావు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

వితంతువుపై లైంగికదాడికి యత్నం

టేకులపల్లి: వితంతువుపై ఓ వ్యక్తి అత్యాచారానికి యత్నించిన సంఘటన ఆలస్యంగా ఆదివారం వెలుగుచూసింది. మండలంలోని మారుమూల ఏజెన్సీ గ్రామానికి చెందిన, 45 ఏళ్ల వితంతు మహిళ తన కుమార్తెతో కలిసి ఉంటోంది. ఈ నెల 23న రాత్రి అదే గ్రామానికి చెందిన 56 ఏళ్ల వ్యక్తి ఇంట్లోకి చొరబడి నిద్రిస్తున్న ఆమెపై లైంగిక దాడికి యత్నించాడు. దీంతో ఆమె ప్రతిఘటించి కేకలు వేసింది. దీంతో చుట్టుపక్కల వారు వచ్చి దేహశుద్ధి చేయడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనపై శనివారం గ్రామంలో విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ విషయమై బోడు ఎస్ఐ పొడిశెట్టి శ్రీకాంత్‌ను వివరణ కోరగా.. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

8 నెలల క్రితం వృద్ధురాలిపై లైంగిక దాడి

అదే గ్రామంలో 8 నెలల క్రితం 80 ఏళ్ల వృద్ధురాలిపై లైంగిక దాడి జరిగింది. ఆమె భర్త మృతి చెందడంతో వృద్ధురాలు ఒక్కతే ఇంట్లో ఉంటోంది. ఇది గమనించిన కామాంధుడు రాత్రి వేళ ఇంట్లోకి జొరబడి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత డబ్బుల కోసం ఇంట్లో సామాన్లను చిందర వందరగా పడేశాడు. మరుసటి రోజు స్థానికుల ద్వారా కుటుంబ సభ్యులు విషయం తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు అప్పటి నుంచి కామాంధుడి కోసం గాలిస్తున్నారు. కాగా వితంతువుపై లైంగిక దాడికి యత్నించిన వ్యక్తే వృద్ధురాలిపై అఘాయిత్యం చేసి ఉంటాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



ఉల్లిగడ్డ బస్తా మోస్తున్న రఘురాంరెడ్డి

'బరువు'.. బాధ్యతలు మోస్తా

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి

ఖమ్మంవన్‌టౌన్: తనను అత్యధిక మెజార్టీతో ఎంపీగా గెలిపిస్తే అందరి బరువు బాధ్యతలను మోస్తానని కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం ఖమ్మంలోని పెద్ద కూరగాయల మార్కెట్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హమాలీలతో కలిసి ఉల్లిగడ్డ బస్తాలను మోసి, ప్రజాసేవలో పది కాలాల పాటు ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు మహ్మద్ జావీద్, ముదిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మద్దినేని బేబీస్వర్ణకుమారి, నాగండ్ల దీపక్‌చౌదరీ, దొబ్బల సౌజన్య, ప్రతిభారెడ్డి పాల్గొన్నారు.

పరిశీలకులు వీరే..

అబ్జర్వర్	పేరు	ఫోన్ నెంబర్
సాధారణ పరిశీలకులు	డాక్టర్ సంజయ్ గేంద్రోజ్ కోల్టే	93462 93006
పోలీస్ పరిశీలకుడు	చరణ్‌జిత్ సింగ్	89193 85028
వ్యయ పరిశీలకులు	అరుణ్‌ప్రశాంత్ కృష్ణసామి	93985 60844
(ఖమ్మం, పాలేరు, మధిర అసెంబ్లీ నియోజకవర్గాలు)		
వ్యయ పరిశీలకులు	శంకర ఆనంద్ మిశ్రా	93985 59986
(వైరా, సత్తుపల్లి, కొత్తగూడెం, అశ్వారావుపేట అసెంబ్లీ నియోజకవర్గాలు)		

ఖమ్మం సహకారనగర్: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సమీపిస్తుండడంతో కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లలో వేగం పెంచింది. ఈ మేరకు ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గంలో ఏర్పాట్ల పరిశీలన.. వ్యయ పర్యవేక్షణ కోసం నలుగురు పరిశీలకులను నియమించింది. ఇప్పటికే జిల్లాకు చేరుకుని విధుల్లో నిమగ్నమైన వీరు... ప్రజలకు ఏమైనా ఇబ్బందులు ఉన్నా, ఫిర్యాదు చేయాలనుకున్నా తమను సంప్రదించాలని సూచించారు.

రెవెన్యూ విశ్రాంత ఉద్యోగుల సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న విశ్రాంత ఉద్యోగులు

ఖమ్మంమయూరిసెంటర్ : ఉమ్మడి ఖమ్మం జిల్లా రెవెన్యూ విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఖమ్మంలోని శ్రీశ్రీ హోటల్‌లో నిర్వహించారు. స్తంభాద్రి బ్యాంక్ చైర్మన్, జిల్లా, రాష్ట్ర మాజీ ఉద్యోగ సంఘ నాయకులు ఎర్నేని రామారావు అధ్యక్షతన జరిగిన ఈ సమ్మేళనంలో ఉమ్మడి జిల్లా రెవెన్యూ రిటైర్డ్ ఉద్యోగులు కలుసుకున్నారు. ఉద్యోగ జీవితంలో, తాము పని చేసిన ప్రాంతాలను, జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం విశ్రాంత ఉద్యోగులందరినీ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమ కన్వీనర్ బసవరాజు ఉపేందర్‌రాజు, రిటైర్డ్ ఐఏఎస్ ఎం.రామారావు, పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కళ్యాణం కృష్ణయ్య, వెలిగేటి చంద్రమోహన్, కేవీ మురళీకృష్ణ,మల్లంపాటి సుధాకర్, మేదరమెట్ల సుబ్బయ్య, ఇల్లూరి సైదయ్య, కూరపాటి రంగరాజు, రామడుగు రవీందర్‌రావు, మాడిశెట్టి శ్రీహరి పాల్గొన్నారు.

వివాహాలకు విరామం

- మూడు నెలల పాటు మూఢాలు
- ఆగస్టు నుంచి మళ్లీ శుభ ముహూర్తాలు

ఖమ్మంగాంధీచౌక్: గురు, శుక్ర మూఢాల కారణంగా ఆదివారం నుంచి శుభ ముహూర్తాలు లేవు. దాదాపు మూడు నెలల పాటు వివాహాది శుభకార్యాలకు విరామంగా పండితులు ప్రకటించారు. తిరిగి శ్రావణ మాసం(ఆగస్టు) నుంచి శుభ ముహూర్తాలు ఉంటాయని వెల్లడించారు. గతేడాది నిజ శ్రావణం అంటే ఆగస్టు 19 నుంచి ప్రారంభమైన శుభ ముహూర్తాలు ఈ ఏడాది జనవరిలో మినహా ఏప్రిల్ 28 వరకు కొనసాగాయి. దాదాపు 8 నెలల పాటు శుభ కార్యాలు, వివాహాలు వంటి కార్యక్రమాలు జోరుగా సాగాయి. అన్ని గ్రహ బలాలు ఉంటేనే శుభ ముహూర్తాలు ఉంటాయని, ఏప్రిల్ 28 నుంచి గురు, శుక్ర గ్రహాల బలాలు లేకపోవడంతో ముహూర్తాలకు అంతరాయం వచ్చిందని పండితులు చెబుతున్నారు. గురు, శుక్ర మూఢాల కారణంగా ఏప్రిల్ 28 నుంచి ఆగస్టు 7వ తేదీ వరకు మూఢాలుగా వ్యవహరిస్తామని పండితులు ప్రకటించారు. ఆగస్టు 5వ తేదీ నుంచి శ్రావణ మాసం ప్రారంభమవుతుందని, అదేనెల 8వ తేదీ నుంచి శుభముహూర్తాలు తిరిగి ప్రారంభం కానున్నాయని తెలిపారు. మళ్లీ బాద్రపద మాసంలో శుభముహూర్తాలు లేవని, ఆశ్వయుజం, కార్తీకం, మార్గశిర మాసాల్లో ఉన్నాయని, మాఘ, పాల్గుణ మాసాల్లోనూ ముహూర్తాలు ఉన్నాయని వివరించారు.